
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

గురువారం 31 అక్టోబరు 2024



దీపావళి గ్రామం

దీపావళి పండగ.. ఆ ఊరి పేర్లలో నిండుగా..

● జిల్లాలో రెండు గ్రామాలకు దీపావళి పేరు




దీపావళి గ్రామం

ఊరు కాలింది.. 'దీపావళి'గా మారింది

హిందువుల ముఖ్యమైన పండగల్లో ముఖ్యమైనది దీపావళి. ఈ వెలుగుల పండగ దీపావళి పేరిట జిల్లాలో రెండు గ్రామాలు ఉన్నాయి. కొన్ని దశాబ్దాల కిందట వేర్వేరుగా జరిగిన సంఘటనలతో ఆ రెండు గ్రామాలకు ఆ పేర్లు వచ్చాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఏటా దీపావళిని ఘనంగా జరుపుకొంటుంటారు. ఆ గ్రామాలు గార, టెక్కలి మండలాల్లో ఉన్నాయి.

టెక్కలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అయోధ్యపురం పంచాయతీలో దీపావళి అనే ఓ మారుమూల కుగ్రామం ఉంది. ఈ గ్రామంలో 48 కుటుంబాలు జీవిస్తున్నాయి. 300 మంది జనాభా కలిగిన ఈ గ్రామమంతా ఒకే కులానికి (వడ్ర కులం) చెందిన వారు కావడం విశేషం. దీంతో పూర్వం వడ్రపేట గ్రామంగానే పిలవబడేది. అయితే, ఏడు దశాబ్దాల కిందట దీపావళి సందర్భంగా గ్రామస్థుల్లో ఎవరో కాల్చిన పటాకీ ఓ పూరింటిపై పడింది. ఈ మంటలు చుట్టుపక్కలా వ్యాపించడంతో ఊరంతా తగలబడిపోయింది. ఆ మంటలను చూసి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు.. వడ్రపేట గ్రామస్థులు దీపాలు ముట్టించారని భావించారు. అయితే, తెల్లవారి విషయం తెలిసి.. మాకంతా దీపాల్లా కనిపించాయని, అందుకే రాలేకపోయామని వారు అన్నారు. కాలక్రమేణా వడ్రపేట గ్రామం పేరు దీపావళిగా మారిపోయింది. రెవెన్యూ రికార్డుల్లో కూడా దీపావళిగానే నమోదైంది.



మా తండ్రుల తరం నుంచి..

మా తండ్రుల తరం నుంచి ఇప్పటి వరకు దీపావళిగానే ఈ గ్రామాన్ని పిలుస్తున్నాం. రెవెన్యూ రికార్డుల్లో కూడా ఇదే నమోదైంది. ఈ ప్రాంతంలో దీపావళి గ్రామంగా ఇదొక్కటే పిలవబడుతుంది.

-దివిలి శేషయ్య, దీపావళి గ్రామం

సందడిగా చేసుకుంటాం..

ఒకప్పుడు దీపావళి నాడు ఊరు కాలిపోయిందనే సెంటిమెంట్ మాకు లేదు. నేడు ఊరంతా డాబా ఇళ్లే. ఇంటిల్లిపాది బోదుల్లు కాల్చి దీపాల అమావాస్య సందడిగా చేసుకుంటాం.

-జామి చిన్నవాడు, దీపావళి గ్రామం

రాజు పెట్టిన పేరు..

గార, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పేరిట ఒక గ్రామం ఉంది. ఈ గ్రామానికి ఆ పేరు పెట్టడంపై ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. 'దశాబ్దాల కిందట సిక్కోలు రాజు ప్రతిరోజూ గుర్రం మీద శ్రీకాకుళం నుంచి కళింగపట్నం వెళ్లి వస్తుండేవారు. ఒకరోజు వేసవిలో ఎండ తీవ్రతకు ఆ రాజు ఈ గ్రామం వద్ద స్పృహ తప్పి పడిపోయారు. సమీపంలోని కూలీలు, భక్తులు వచ్చి రాజుకు సపర్యలు చేశారు. రాజు కోలుకున్న తర్వాత వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గ్రామం పేరు ఏమిటి. నా ప్రాణం కాపాడిన మీ రుణం తీర్చుకోలేనిది అన్నారు. అప్పటికి ఆ గ్రామం చిన్న చిన్న నివాసాలతో ఉండేది. అప్పుడు వెంటనే రాజు దీపావళి పండగ రోజు నా ప్రాణాలు కాపాడిన ఈ గ్రామానికి దీపావళి అనే పేరుతో పిలుద్దాం అన్నారు.' అప్పటి నుంచి ఈ గ్రామం దీపావళి పేరుతో కొనసాగుతోంది.

మా ఊరంటే ఎంతో ఇష్టం



దీపావళి పండగ పేరు మా గ్రామానికి ఉండడం సంతోషంగా ఉంది. అందుకే మా ఊరు అంటే నాకు ఎంతో ఇష్టం. ఏటా దీపావళిని ఘనంగా జరుపుకొంటాం.

-చల్ల శ్రీనివాసరావు, పంచాయతీ సర్పంచ్

ఆనందంగా చేసుకుంటాం..

మా గ్రామంలో ఏడాది పొడవునా పండగలు, పర్వదినాలను ఎంతో ఉత్సాహంగా జరుపుకొంటాం. దీపావళిని కూడా ఆనందంగా చేసుకుంటాం.

-శ్రీరంగం మధుసూదనరావు, విశ్వ హిందూ పరిషత్, జిల్లా కార్యదర్శి

రేపు జిల్లాకు సీఎం చంద్రబాబు రాక

● ఉచిత గ్యాస్ పథకం ప్రారంభం

● ఈదుపురంలో సభ..

● రాత్రికి శ్రీకాకుళంలో బస



శ్రీకాకుళం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం జిల్లాకు రానున్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన దీపం పథకాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గం ఈదుపురం గ్రామంలో ఆయన ప్రారంభించనున్నారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు అందించనున్నారు. ఈదుపురంలో ఏర్పాటు చేసే సభలో లబ్ధిదారులతో నేరుగా ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. అనంతరం కవిటి, కంచిలి మండలాల సమీప ప్రాంతాల్లో పర్యటించే అవకాశముంది. అదే రోజు రాత్రి శ్రీకాకుళం చేరుకుని.. డచ్ భవనం వద్ద విశ్రాంతి తీసుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమాలను సీఎం ప్రారంభిస్తారు. శనివారం ఉదయం శ్రీకాకుళంలో జరిగే కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం విజయనగరం జిల్లా బయలుదేరి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో జిల్లా అధికార యంత్రాంగం తలమునకలైంది.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..

సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం 10.35 గంటలకు విజయవాడ నుంచి విమానంలో బయలుదేరుతారు. 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 12.40 గంటలకు ఇచ్ఛాపురం మండలం ఈదుపురం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. 1.05 గంటలకు ఈదుపురంలోని వెంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద ఉచిత గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారి స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకుంటారు. 1.50 గంటలకు ఈదుపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 2.45 గంటల నుంచి 3.15 గంటల వరకు భోజన విరామం. అక్కడ నుంచి హెలీక్యాప్టర్‌లో బయలుదేరి 3.45 గంటలకు శ్రీకాకుళం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కి చేరుకుంటారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బసచేస్తారు. మరుసటి రోజు శనివారం ఉదయం 8.35 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి విజయనగరం జిల్లా వెళ్తారు.

యూబీ పరిశ్రమలో సీఐడీ తనిఖీలు

రణస్థలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంటుపల్లి యూబీ పరిశ్రమలో సీఐడీ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతన మద్యం పాలసీ అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గత ఐదేళ్లలో నిర్వహించిన ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడి, ప్రైవేట్ మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బాట్లింగ్ యూనిట్లతో పాటు బేవరేజెస్ పరిశ్రమల్లో సీఐడీ, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం బంటుపల్లి యూబీ పరిశ్రమను సీఐడీ అధికారులు తనిఖీ చేశారు. పరిశ్రమలోకి ఇతరులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. నాసిరకం మద్యం సరఫరాపై ఆరా తీసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ తనిఖీలు సాయంత్రం ఐదున్నర గంటల వరకూ కొనసాగాయి.

ఆనంద దీపాలు వెలిగిద్దాం

6లో



సీఎం వస్తారని.. మాట ఇస్తారని!

6లో

● ఏడాదిన్నర కిందట కూలిన బాహుదా వంతెన



కూలిన బాహుదా వంతెన (ఫైల్)

ధరలు పేలుతున్నాయ్!

● నింగిన తాకిన టపాసుల రేట్లు ● సామాన్యుల గగ్గోలు



నరసన్నపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది టపాసుల ధరలు పేలుతున్నాయి. సామాన్యులకు అందనంత స్థాయిలో తారాజువ్వాల్లా దూసుకుపోతున్నాయి. రూ.2వేలు తీసుకువెళ్లితే తప్ప సామగ్రివచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలకు గాను జిల్లా వ్యాప్తంగా 90 షాపులకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. మూడు రోజులకు మాత్రమే అమ్మకాలకు అనుమతులు ఇవ్వడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారారు. ఇష్టం వచ్చిన ధరలకు విక్రయిస్తున్నారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస, నరసన్నపేట, ఆమదాలవలస తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు అధికంగా ఒడిశా నుంచి బాణసంచా దిగుమతి చేసి రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచి విక్రయాలు చేపడుతున్నారు. గత ఏడాది లక్ష్మీబాంబుల కట్ట(10) రూ.200 ఉండగా ఈ ఏడాది రూ.600 పలుకుతోంది. ప్యాకెట్లపై ఉన్న ఎంఆర్‌పీకి కేవలం 10 నుంచి 20 శాతం వరకు తగ్గించి అమ్మకాలు చేస్తున్నారు. కానీ, గతంలో ఎంఆర్‌పీ కంటే 80 శాతం వరకు తక్కువకు విక్రయించేవారు. కానీ ఈఏడాది ఖర్చులు పెరిగాయని, అందుకే ధరలు పెంచామని వ్యాపారులు చెబుతున్నారు. బ్రాండెడ్ క్రాకర్లు విక్రయించేడం లేదు. తక్కువ నాణ్యతకు చెందిన రకాలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కొక్క బాక్సు రూ.400 వరకు పలుకుతోంది.

పురాతన శివాలయాన్ని కూల్చేశారు!

● బొడ్డపాడులో రాత్రికి రాత్రే నేలమట్టం

● ఈ విధ్వంసానికి పాల్పడింది ఎవరు?

● తేల్చాలంటున్న ఆలయ పూజారి



ధ్వంసమైన ఆలయం వద్ద గ్రామస్థులు

రణస్థలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రణస్థలం మండలం చిల్లపేట రాజాం పంచాయతీ బొడ్డపాడులో పురాతన శివాలయాన్ని దుండగులు బుధవారం రాత్రి కూల్చేశారు. రాత్రికి రాత్రే నేలమట్టం చేశారు. ఈ విధ్వంసానికి పాల్పడింది ఎవరో తేల్చాలని ఆలయ పూజారి ఫణిశర్మ అధికారులను కోరుతున్నాడు. ఈ గ్రామంలో వెయ్యేళ్ల చరిత్ర కలిగిన సోమేశ్వరాలయం ఉంది. ఈ ఆలయానికి వంశపారంపర్య పూజారిగా ఫణిశర్మ వ్యవహరిస్తున్నారు. గురువారం ఉదయం ఆలయంలో దూప దీప నైవేద్యాల కోసం ఆయన వచ్చారు. అక్కడ ఆలయం పూర్తిగా నేలమట్టమై ఉండడంతో ఖంగుతిన్నారు. ఎక్స్‌కవేటర్‌తో ఆలయాన్ని కూల్చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ఇక్కడ స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పాటు శివలింగం ఉండేది. ఈ ప్రాంతానికే శైవక్షేత్రంగా విరాజిల్లేది. కానీ, ఇంతలోనే విధ్వంసానికి గురికావడంతో ఈ ప్రాంతీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని హిందూవాదులు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులు బాగుపడేనా?



మరమ్మతులకు నోచుకోని కళింగదల్ రిజర్వాయర్



పిచ్చిమొక్కలతో నిండిన డబార్సింగి రిజర్వాయర్

● గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం ● రూపాయి కూడా విదల్చని వైనం

● సాగునీటికి తప్పని ఇబ్బందులు ● సీఎం చంద్రబాబుపైనే రైతుల ఆశలు

ప్రాజెక్టు పేరు: కళింగదల్

ఆయకట్టు: 2,520 హెక్టార్లు

సాగునీరందించే మండలం: మందస

ప్రస్తుత స్థితి: మండలంలో అతిపెద్ద అత్యధిక ఆయకట్టు ఉన్న రిజర్వాయర్ ఇది. నిర్మించి రెండు దశాబ్దాలు గడిచింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేశారు. గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. దీంతో మరమ్మతులు జరగక.. షట్టర్లు విరిగి, కాలువలు మేట వేసి నీరు రాని దుస్థితి నెలకొంది. రిటైనింగ్ వాల్‌లు, సర్‌ప్లస్ వాల్‌లు కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. నవరపద్మాపురం, కృష్ణాపురం, గౌడుగురండి వంటి శివారు గ్రామాలకు నీరందడం లేదు. దీంతో ఆయా గ్రామాలు కరవు కోరల్లో చిక్కుకున్నాయి.

హరిపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని కళింగదల్, డబార్సింగి, దామోదర సాగర్ ప్రాజెక్టులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కోట్లాది రూపాయల వ్యయంతో పురుడు పోసుకొని లక్షలాది మంది రైతులకు సంజీవినిగా మారిన ఈ ప్రాజెక్టులు వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. గత ఐదేళ్ల పాటు నిర్వహణకు నోచుకోక మరమ్మతులకు గురై మూలుగుతున్నాయి. షట్టర్లు, రిటైనింగ్ వాల్‌లు, మదుములు, స్లూయిస్‌లు సైతం బీటలు వారి కూలిపోయే స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. కాలువల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి శివారు భూములకు సాగునీరందని దైన్యపరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు తొలిసారి జిల్లా పర్యటనకు శుక్రవారం వస్తున్నారు. దీంతో రిజర్వాయర్ల మరమ్మతులకు నిధుల వర్షం కురిపిస్తారని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రాజెక్టుపేరు: దామోదర సాగరం

ఆయకట్టు: 1,225 హెక్టార్లు, మండలం: మందస

ప్రస్తుత స్థితి: నిర్మించి 12ఏళ్లు అయింది. రూ.2.24కోట్ల వ్యయంతో నిర్మించి కాలువలు తవ్వలేదు. దీంతో ఖర్చు అయిన నిధులు బూడిదలో పోసిన పన్నీరైంది. సిమెంటు నిర్మాణల్లోనూ నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మదుములు, తూములు నిర్మించిన ఏడాదికే బీటలు వారాయి. దీంతో షట్టర్లు తెరుచుకోక, తెరిస్తే మూసుకోక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. 1,225 హెక్టార్ల ఆయకట్టు కేవలం కాగితాలకే పరిమితమైంది. దీంతో శివారు భూములకు నీరందక కనీసం ఒక్క పంటకూడా పూర్తి స్థాయిలో పండించలేని పరిస్థితి రైతులది.



డబార్సింగి రిజర్వాయర్ సిమెంటు కట్టడాల దుస్థితి

ఉద్దానం ప్రాజెక్టు..

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో సుమారు 297గ్రామాలకు తాగునీరందించే ఉద్దానం ప్రాజెక్టును గత ఐదేళ్లుగా కనీసం పట్టించుకొనే నాథుడే లేడు. కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రాజెక్టులో పనిచేసే సిబ్బందికి ఏడాది జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించి ఆదుకోవాలని ఉద్దానం ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

ప్రాజెక్టు పేరు: డబార్సింగి

ఆయకట్టు: 1,112 హెక్టార్లు

సాగునీందించే మండలం: మందస

ప్రస్తుత స్థితి: దశాబ్దం కిందట ఈ రిజర్వాయర్ నిర్మాణం జరిగింది. పనులు అంతా అరకొరే. కాలువలు నిర్మించినా ఏడాదికే రూపం కోల్పోయాయి. సుమారు 18 గ్రామాల పరిధిలోని 1,112 హెక్టార్ల ఆయకట్టుకు నీరందించాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం కనీసం 10 గ్రామాలకు నీరందని దుస్థితి. రిజర్వాయర్ నిర్మాణ దశలోనే ప్రతిపాదనలు మారి, డిజైనింగ్ కూడా మారింది. దీంతో నీరు నిలువ ఉండ ని పరిస్థితి ఉంది. రిటైనింగ్ వాల్‌లో రాళ్లు కూలిపోయి ప్రమాదకర పరిస్థితి నెలకొంది. షట్టర్లు మూసుకోక కాలువల వెంబడి నిరంతరం నీరు వృథాగా పోతుంది.



ఆనంద దీపాలు వెలిగిద్దాం!

● రసాయనాలతో పొంచి ఉన్న ప్రమాదం ● దీపాల వెలుగులే ఉత్తమం



హిరమండలం/నరసన్నపేట, శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):

దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. అంటే దీపాల వెలుగుల మధ్య పండగ జరుపుకోవాలని.. వెలుగులను పంచాలని అంతరార్థం. కానీ ప్రస్తుత సమాజంలో ఈ పండగ కూడా హోదా చిహ్నంగా మారిపోయింది. దీపాలను వెలిగించడానికి బదులు రూ.వేలకు వేలు వెచ్చించి విషపూరిత రసాయనాలతో తయారు చేసిన బాణసంచాను కాల్చుతున్నారు. దీంతో అటు పర్యావరణానికి, ఇటు ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీపావళి అంటేనే కొన్ని వర్గాల వారు భయ భ్రాంతులకు గురవుతున్నారు. దీనికి పరిష్కార మార్గమే దీపాలతో పండగను పర్యావరణ హితంగా జరుపుకోవడం.

నూనెతో వెలిగిస్తే...

దీపాల కాంతి ఉన్నంత వరకు ఎలాంటి చెడు జరగదని హిందువుల ప్రగాఢ విశ్వాసం. ఆ వెలుగులు స్వచ్ఛంగా ఉండాలంటే.. నూనెతో వెలిగే దీపాలను ఇంటిల్లిపాదీ కలిసి వెలిగిస్తూ అద్వితీయ ఆనందాన్ని పొందవచ్చు. విద్యుత్‌ను భారీగా ఆదా చేయవచ్చు. కష్టపడి మట్టితో ప్రమిదలు తయారు చేసి రోడ్డు పక్కన విక్రయించే పేద కార్మికులకు పట్టెడన్నం పెట్టొచ్చు. ఒకసారి నూనె పోసి వెలిగిస్తే మూడు నుంచి నాలుగు గంటల పాటు దీపాలు వెలుగుతాయి.

శబ్ద నియంత్రణ ముఖ్యం..

జనావాసాల మధ్య కాల్చే బాణసంచా శబ్దం 45 డెసిబుల్స్‌కు మించరాదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మనం కాలుస్తున్న బాణసంచా శబ్దాల స్థాయి దాదాపు 100 డెసిబుల్స్ పైగానే ఉంటోంది. దీపావళి పండుగకు ముందు వాతావరణంలో వాయు కాలుష్య స్థాయి 60 ఉంటే.. పండుగ తరవాత దాదాపు 100 దాటుతోందని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చెబుతున్నారు. దీని వల్ల వినికిడి సమస్యలు తలెత్తుతున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. ధ్వని కాలుష్య ప్రభావం జంతువులు, చిన్న పిల్లలు, వృద్ధులపై ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి. చెట్ల పైకి తారా జువ్వలు, రాకెట్లు వంటివి వేసి పక్షి జాతులకు ఇబ్బంది కలిగించకూడదు. హైబీపీ, గుండె జబ్బులు ఉన్నవారు తీవ్రంగా ఇబ్బందులు పడతారు. ఇళ్లలో పక్షులను, పెంపుడు జంతువులను ఉంచి బాణసంచా కాల్చరాదు. వీలైతే టీవీ, సినిమా పాటలు పెట్టి వాటికి శబ్దాల తీవ్రత ఎక్కువగా తగలకుండా చూడాలి.

● చిన్నారులు తట్టుకోలేరు..

అప్పుడే పుట్టిన పసికందుల నుంచి ఐదేళ్ల చిన్నారుల వరకూ దీపావళి రోజు వచ్చే శబ్దాలకు మానసికంగా కుంగిపోతుంటారు. అత్యధికంగా వచ్చే శబ్దాలు, కాపర్, లెడ్, సోడియం వంటివి మండటం వల్ల వచ్చే పొగ వారి ఊపిరితిత్తుల్లోకి వెళ్లి శ్వాస కోస వ్యాధుల బారిన పడతారు.

● రసాయనాలతో ప్రమాదం..

టపాసులు కాల్చినపుడు అందులోని రసాయనాలు మండి విషపూరిత వాయువులు విడుదల అవుతాయి. వాటిని పీల్చితే అన్ని వర్గాల వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

● **కాపర్:** కాపర్ వినియోగం వల్ల చికాకు, తలనొప్పి వస్తాయి. ముక్కు, నోటి రంధ్రాల నుంచి ఊపిరితిత్తుల వరకూ దీని ప్రభావంతో శ్వాస ఆడకపోవడం, విపరీతమైన తగ్గు వస్తుంది. ● **జింక్:** తలనొప్పి, వాంతులబారిన పడతారు. ● **సోడియం:** శరీరంపై దద్దుర్లు వంటి చర్మ సంబంధ వ్యాధులకు గురవుతారు. ● **కాడ్మిడియం:** రక్తహీనత తలెత్తుంది. కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ● **లెడ్:** నాడీ వ్యవస్థ దెబ్బతినడం, జ్వరం, తలనొప్పి, జలుబు, వణుకు, వాంతులు, గుండెల్లో మంట బాధిస్తాయి. ● **నైట్రేట్:** దీని మోతాదు మించితే మానసిక రుగ్మతలు తలెత్తుతాయి. చిన్నారులపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది.



● ఇలా చేస్తే మంచిది..

● టపాసులు చట్ట ప్రకారం లైసెన్స్ కలిగిన వ్యాపారుల వద్ద కొనాలి. ● పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దలు వెంట ఉండి పరిశీలించాలి. ● బాణసంచా పెట్టెల మీద రాసి ఉన్న జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలి. ● కొవ్వొత్తి, అగరబత్తిని మాత్రమే టపాకాయలను కాల్చేందుకు వాడాలి. ● టపాసులు కాల్చేటపడు నీటిని కూడా అందుబాటులో ఉంచుకోవాలి. ● ప్రమాదకరమైన బాంబులను నివాసాల మధ్య పేల్చకుండా ఉండటం మంచిది. ● గాలిలో పేల్చే టపాసులను విశాలమైన స్థలంలో కాల్చడం మంచిది. ● ఒకసారి నిప్పంటించిన టపాసు పేలకపోతే వాటిని తిరిగి వెలిగించేందుకు తొందర పడకూడదు. ● పేలని టపాసును నీళ్లలో ముంచి పక్కన పడేయడం మంచిది.

ఇలా చేయకూడదు..

● కాకరపువ్వులు, మతాబులు, భూచక్రాలు, విష్ణు చక్రాలు కాలిన తరువాత వాటిని కాలితో తన్నడం మంచిది కాదు. ● టపాసులను చేతిలో పట్టుకుని కాల్చకూడదు. ● పనిచేయని వాటిని వెలిగించే ప్రయత్నం చేయకూడదు. ● గాలిలో పేల్చే పటాసుల్ని విద్యుత్ తీగల వద్ద, డాబాలు, చెట్లు, ఆకుల కింద కాల్చితే ప్రమాదాలు సంభవిస్తాయి. ● బాణసంచా తయారు చేసేటపుడు ప్రయోగాలకు దూరంగా ఉండాలి.

ఇవి పాటించాలి..

● వయో వృద్ధులు, పసిపిల్లలు, మహిళలు, హృద్రోగం, అనారోగ్యంతో ఉన్న వారికి సమీపంలో టపాసులు పేల్చకూడదు. ● బాణసంచా దుకాణాల్లో విద్యుదాఘాతం వల్లనే ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తాయి. అందుకే దుకాణాల్లో విద్యుత్ వైరింగ్ ఏర్పాటు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ● ప్రతి దుకాణంలో ఏర్పాట్లను పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తప్పనిసరిగా తనిఖీ చేయాలి. ● పొరపాటున ప్రమాదం జరిగితే వెంటనే పోలీసు, అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇవ్వాలి.

ప్రమాదాలను ఇలా నివారిద్దాం..

● పేలే టపాసులకు దూరంగా ఉండాలి. ● బాణసంచా కాల్చేటపుడు కాటన్ దుస్తులు ధరించాలి. ● బాణసంచా భారీగా కొనుగోలు చేసి గృహాల్లో నిల్వ చేయవద్దు. ● ఐఎస్ఐ మార్కు కంపెనీల బాణసంచాను మత్రమే కొనాలి. ● సూర్య రశ్మిలో అవసరం మేరకు మాత్రమే టపాసులు ఆరబెట్టాలి. ● కాలి గాయమైతే ప్రథమ చికిత్స కోసం వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ● గాయమైతే ఆయిల్, సిరా పూయరాదు. ● దుకాణాలకు సమీపంలో టపాసులు పేల్చకుండా జగ్రత్త పడాలి. ● టపాసులు విక్రయించే ప్రదేశంలో ఎవరూ చుట్ట, బీడీ, సిగరెట్టు తాగకుండా వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి.

అనుమతి తప్పనిసరి..

టపాసుల విక్రయదారులు తప్పనిసరిగా రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. హోల్‌సేల్ దుకాణాల నుంచి కొనుగోలు చేసిన బాణసంచా ఎగుమతి, దిగుమతి సందర్భంగా జాగ్రత్తలు పాటించాలి. భారీగా కొనుగోలు చేసిన టపాసులను ఆవాసాల్లో నిల్వ చేయకూడదు. టపాసుల విక్రయ దుకాణాలను ఇళ్లకు దూరంగా ఖాళీ మైదానాల్లో ఏర్పాటు చేయాలి. దుకాణాల వద్ద నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి.

నిబంధనలు పాటించాల్సిందే..

దీపావళి పండుగ సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో చేపట్టిన బాణసంచా విక్రయాల్లో వ్యాపారులు నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. మైదానంలో ఏర్పాటు చేసిన షాపులను బుధవారం ఆయన పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, ఏర్పాట్లపై వ్యాపారులకు సూచనలిచ్చారు. షాపులను సందర్శించిన వారిలో డీఎస్పీతో పాటు ట్రాఫిక్ సీఐ నాగరాజు, టూటౌన్ ఎస్ఐ సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.



వ్యాపారులకు సూచనలిస్తున్న డీఎస్పీ వివేకానంద

ప్రమాదాలు సంభవిస్తే..


బాణసంచా కాల్చే సమయంలో అనుకోకుండా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. అందుకే ప్రథమ చికిత్స కిట్‌తో పాటు నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. శరీరం లేదా చేతులు కాలితే మంట తగ్గేవరకూ నీళ్లు పోస్తూ ఉండాలి. బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మోహనరావు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ నెంబర్లకు సమాచారం అందించాలి.

శ్రీకాకుళం	08942 222099
నరసన్నపేట	08942 276777
పలాస	08945 241101
రణస్థలం	08942 234499
టెక్కలి	08945 244277
కోటబొమ్మాళి	08942 238659
ఇచ్ఛాపురం	08647 231101
ఆమదాలవలస	08942 286401
పొందూరు	08941 242101
కొత్తూరు	08946 258444
మందస	08947 237101
సోంపేట	08947 234101





స్వామి వారిని తాకుతున్న సూర్యకిరణాలు




మల్లికార్జునుడికి కిరణాభిషేకం

పలాస, అక్టోబరు 30: స్థానిక పురుషోత్తపురం కాలనీలో స్వయంభూగా వెలసిన ఎండల మల్లికార్జున స్వామిని బుధవారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. దీంతో భక్తులు పులకించి పోయారు. శివ లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఏటా కార్తీక మాసం తొలిరోజుల్లో స్వామివారికి కిరణ స్పర్శ జరుగుతుందని ప్రధాన అర్చకుడు హరీష్‌స్వామి తెలిపారు.

అమ్మవారికి కిరణ స్పర్శ..

కంచిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్తలి గ్రామలో వెలసిన శ్రీమహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌ను బుధవారం ఉదయం 6.42 గంటలకు సూర్యకిరణాలు తాకాయి. దీంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



అమ్మ వారిపై పడిన సూర్యకిరణాలు

కుప్పకూలిన బాహుదా వంతెన (ఫైల్)



సీఎం వస్తారని.. మాట ఇస్తారని!

● ఏడాదిన్నర కిందట కూలిన బాహుదా వంతెన
● తీవ్ర నిర్లక్ష్యం చేసిన వైసీపీ సర్కారు
● డొంకూరు ఉప్పుటేరు వంతెనదీ అదే తీరు
● ప్రజలకు తప్పని కష్టాలు
● చంద్రబాబు రాకతో చిగురిస్తున్న ఆశలు



ఇచ్ఛాపురం, అక్టోబరు 30: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రజలకు రవాణా కష్టాలు తీరడం లేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కటంటే ఒక్క రహదారి కూడా నిర్మాణానికి నోచుకోలేదు. కనీసం రోడ్డు గోతుల్లో మట్టి నింపే ప్రయత్నం చేయలేదు. నియోజకవర్గంలో 40 కిలోమీటర్ల జాతీయ రహదారి తప్ప.. మరే రోడ్డు కూడా బాగున్న దాఖలాలు లేవు. వంతెనలు ప్రమాదకరంగా మారాయి. గత ఐదేళ్లలో వాటిని బాగుచేసే ప్రయత్నం చేయలేదు. ఇదే నియోజకవర్గంలో ఉన్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ రాష్ట్ర స్థాయి పదవుల్లో ఉన్న నేతలు వీటిపై దృష్టి పెట్టలేదు. ముఖ్యంగా ఆంధ్ర-ఒడిశాలను కలిపే కీలకమైన పురాతన బాహుదా వంతెన కూలి పోయింది. అత్యంత ప్రాధాన్యం గల ఈ వంతెన నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సీఎం చంద్రబాబు తొలిసారిగా శుక్రవారం ఇక్కడికి వస్తున్న నేపథ్యంలో వంతెన నిర్మాణానికి కదలిక వస్తుందని ఈ ప్రాంతీయులు ఆశిస్తున్నారు.

● బ్రిటిష్ కాలం నాటి వంతెన..

ఇచ్ఛాపురం పట్టణ ముఖ ద్వారంలో ఉంటుంది బాహుదా నది. దానిపై బ్రిటిష్ కాలం నాటి వంతెన ఒకటి ఉండేది. 2023 మేలో వంతెన కూలిపోయింది. ఓ క్వారీ లారీ వెళ్తుండగా ఒక్కసారిగా వంతెన కుంగిపోయింది. దీంతో లారీ బాహుదా నదిలో పడిపోయింది. డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇచ్ఛాపురం పట్టణానికి బయటి ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. పట్టణానికి రాకపోకలు సాగించాలంటే చుట్టూ తిరిగి జాతీయ రహదారిపై వెళ్లాల్సి వచ్చింది. అప్పటి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైసీపీ ఇన్‌చార్జి సాయిరాజ్‌లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కానీ నాటి జగన్ సర్కారు నిధుల విడుదలలో జాప్యం చేసింది. ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేసింది. సరిగ్గా ఎన్నికల ముంగిట రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ఉత్తర్వులు ఇచ్చింది. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు. కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటుతున్నా.. దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. సీఎం చంద్రబాబు వంతెనకు మోక్షం కల్పించాలని ఇరు రాష్ట్రాల ప్రజలు కోరుతున్నారు.

● ఉప్పుటేరుదీ అదే పరిస్థితి..

డొంకూరు వద్ద ఉప్పుటేరు వంతెనదీ అదే పరిస్థితి. ఇక్కడ 23 సంవత్సరాల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంతో ఈ వంతెన భవిత ప్రశ్నార్థకంగా మారింది. ఈ వంతెనపై 14 గ్రామాలు ఆధారపడి ఉన్నాయి. వర్షాకాలంలో వంతెనపై నీరు నిలుస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వరదల సమయంలో ఈ 14 గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అదిగో ఇదిగో అంటూ కాలయాపనే తప్ప వంతెనపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. 23 సంవత్సరాల కిందట చంద్రబాబు ప్రభుత్వమే ఈ వంతెన నిర్మించింది. ఇప్పుడు కూడా టీడీపీ ప్రభుత్వంపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

● వైసీపీ సర్కారు వదిలేసింది



ఏడాదిన్నర కిందట బహుదా నదిపై ఉన్న వంతెన కూలిపోయింది. వెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఈ పాటికే పూర్తయ్యేవి. కానీ వైసీపీ ప్రభుత్వం కాలయాపనతో గడిపేసింది. నిధులు విడుదలయ్యాయని చెప్పడం నిజంగా ఎన్నికల స్టంట్. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గుర్తించాలి. ప్రాధాన్య ప్రాజెక్టుగా భావించి త్వరితగతిన నిర్మాణ పనులకు పూనుకోవాలి.

-కాళ్ల జయదేవ్, టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు, ఇచ్ఛాపురం

● నరకయాతన..

ఉప్పుటేరు వంతెనపై నరకయాతన పడుతున్నాం. ప్రస్తుతం వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షాకాలంలో మేము పడే బాధలు వర్ణనాతీతం. మా గ్రామాలకు బయటి ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

-దున్న లోకనాథం, డొంకూరు

ఘనంగా నరకాసుర వధ

అరసవల్లి/గార, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి సన్నిధిలో బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో నరక చతుర్ధిని ఘనంగా నిర్వహించారు. తొలుత విశేష అలంకరణలో స్వామి వారి ఉత్సవమూర్తులకు తిరువీధి నిర్వహించారు. అనంతరం చిన్నతోటలో గల ఛాయాదేవి మండపంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. నరకాసురుడి ప్రతిమను ఏర్పాటు చేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అలాగే గార మండలం బూరవెల్లిలో లక్ష్మీనృసింహ స్వామి వారి తిరువీధులు, నరక చతుర్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు.



నరకాసురుని బొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



ఆదిత్యునికి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

అనారోగ్యంతో సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి

● స్వగ్రామంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న అధికారులు, కుటుంబ సభ్యులు



గోవిందరావు (ఫైల్)

జలుమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సైరిగాం పంచాయతీ లింగన్నాయుడుపేటకి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ కొర్ను గోవిందరావు (39) అనారోగ్యంతో తమిళనాడు రాష్ట్రం చెన్నైలో మృతిచెందాడు. ఆయన మృతదేహానికి స్వగ్రామంలో బుధవారం సాయంత్రం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గోవిందరావు 2007లో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఎంపికై ప్రస్తుతం చెన్నైలో డిప్యూటేషన్‌పై సీటీబీలో విధులు నిర్వహిస్తున్నాడు. గత వారం రోజు లుగా అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈయనకు తల్లిదండ్రులు సుందరమ్మ, సంజీవరావు, భార్య సత్యవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సుందర సిక్కోలులో భాగస్వాములు కావాలి

● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

అరసవల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సుందర సిక్కోలు నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని డైమండ్ పార్కు, పాత హౌసింగ్ బోర్డు కాలనీ పార్కు, నాగావళి రివర్ వ్యూ తదితర పార్కులను ఆయన ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పార్కుల్లో పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. రీడింగ్ రూమ్‌లను పరిశీలించి పాఠకులతో మాట్లాడారు. అనంతరం నాగావళి తీరంలో పర్యటించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

తీరం వెంబడి రోడ్డు: ఎమ్మెల్యే

నాగావళి నదీ తీరంలో రోడ్డు నిర్మాణం చేపట్టను న్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని నదీ తీరంలో బుధవారం ఉదయం రెండున్నర కిలో మీటర్ల మేర పరిశీలించారు. ఇప్పటికే కలెక్టర్, కమిషనర్లతో చర్చించమాని, త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేపడితే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంలో ప్రయాణించే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్పొరేషన్ అధికారులు అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలుపాల్గొన్నారు.



నాగావళి తీరంలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే శంకర్

లిఫ్ట్ నుంచి జారిపడి మహిళ మృతి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నబరాటం వీధిలో ఉన్న ఓ గాజుల షాపులోని లిఫ్టులో జారిపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికలు తెలిపిన వివరాల మేరకు.. గాజులు కొనుగోలు చేసేందుకు నిర్మల అనే మహిళ ఆ షాపునకు వెళ్లింది. ఆ షాపులో ఉన్న లిఫ్ట్ కొన్నాళ్లగా పనిచేయడం లేదు. ఇది తెలియని ఆమె లిఫ్టులోకి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు కిందకి జారిపడిపోవడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని టూటౌన్ పోలీసులు తెలిపారు.

పోలీసు అమరవీరులకు జోహార్లు

● నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ



నగరంలో కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ వివేకానంద ఎస్పీ కార్యాలయంలో ప్రారంభించగా, పోలీసులు కవాతు చేసుకుంటూ డే అండ్ నైట్ కూడలి మీదుగా దేశభక్తి గీతాలతో ఏడు రోడ్ల కూడలి వరకు కొనసాగించి మానవ హారంగా అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లాలో అమరవీరుల స్మారకోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్టు డీఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వ్యాస రచన పోటీలు, వైద్య శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీఐలు అవతారం, ఉమామహేశ్వరరావు, పైడిపునాయుడు, ఆర్ఐ నర్సింగరావు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఎన్‌సీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో ఏడుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న జేఆర్ పురం సీఐ అవతారం

ఎచ్చెర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దుప్పలవలస గురుకుల పాఠశాల వెనుక ఉన్న లే ఔట్ తుప్పల్లో రెండు కిలోల గంజాయితో ఏడుగురు యువకులు పట్టుబడినట్టు జేఆర్ పురం సీఐ ఎం.అవతారం బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్‌కుమార్, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను పట్టుకున్నట్టు తెలిపారు. ఈ యువకులు ఈ నెల 23వ తేదీన పర్లాకిమిడికి చెందిన సగిపల్లి పవన్ వద్ద రూ.20 వేలకు కొనుగోలు చేసిన రెండు కిలోల గంజాయిని వాటాలు వేసుకుం టుండగా పట్టుకున్నామన్నారు. అరెస్టు అయి నవారిలో నిడిగింట్ల చరణ్, సూర రాజ్‌కుమార్, లక్కవరపు ప్రసాద్‌కుమార్, గుండ్రపు బాలగణపతి, పిన్నింటి చంటి, కూన సాయి కిరణ్, సవలాపురపు వంశీ ఉన్నారని చెప్పారు. వీరి నుంచి గంజాయితో పాటు రెండు మొబైల్స్, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

కుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు

ఆమదాలవలస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిపై బుధవారం కుక్కల దాడి చేశాయి. రెండో తరగతి చదువుతున్న పైడి తులసీనాథ్ తోటి విద్యార్థులు స్కూల్ విడిచిపెట్టిన తర్వాత ఇంటికి వస్తున్న సమయంలో కుక్కలు దాడి చేశాయి. మిగిలిన విద్యార్థులు తప్పించుకోగా తులసీనాథ్‌పై దాడి చేసి గయపరిచాయి. గాయపడిన విద్యార్థిని తల్లిదండ్రులు జొన్నలవలస ప్రభుత్వ ఆసుపత్రికి తీసువెళ్లి చికిత్స అందించారు. ప్రతిరోజూ వీధి కుక్కలు రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతూ దాడులు చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీముఖలింగేశ్వరాలయంలో చండీయాగం



చండీయాగం చేస్తున్న అర్చకులు

జలుమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయంలో బుధవారం భక్తులు చండీయాగం నిర్వహించారు. తాడేపల్లిగూడేంకు చెందిన గుర్రం సత్యనారాయణ కుటుంబ సభ్యులు లోక కల్యాణార్థం చండీయాగం చేశారు. ముందుగా స్వామిక ప్రత్యేక పూజలు చేసి గణపతి పూజ, లక్ష్మీహోమం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించినట్లు అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం తెలిపారు.

యువశక్తి కోసమే 'మేరా యువభారత్'



ర్యాలీలో సీఐ శ్రీనివాసరావు, ఎన్‌వైకే అధికారులు

నరసన్నపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యువత కోసం మేరా యువ భారత్ పేరిట ఒక స్వయంప్రతిపత్తి సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, యువత కోసం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. బుధవారం పట్టణంలో 'నా భారత్‌తో దీపావళి.. మేరా యువభారత్'లో భాగంగా ట్రాఫిక్ వలంటరీ, మార్కెట్ క్లీనింగ్ కార్యక్రమాలను నిర్వహించారు. సీఐ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వాహనం నడిపే ప్రతి వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.శంకరరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, ఈవో ద్రాక్షాయిణి, సెట్‌శ్రీ సూపరింటెండెంట్ ఎల్.రేఖ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో మహా లింగార్చన



పూజలు చేస్తున్న దృశ్యం

అరసవల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు మహాలింగార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, రంజిత్ శర్మ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

జలుమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మెళియాపుట్టిలో ఐటీడీఏ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంగా ఇచ్ఛాపురం వస్తున్నందున ఐటీడీఏను ప్రకటించాలని కోరారు. జిల్లాలో ఐటీడీఏ కేంద్రం ఏర్పాటు వల్ల జిల్లా గిరిజనులకు న్యాయం జరుగుతుందన్నారు.

బాణసంచా విక్రయాలు అంతంతే

● పెరిగిన ధరలు

● తొలిరోజు వెలవెలబోయిన దుకాణాలు



కొనుగోలుదారులు లేక ఖాళీగా వున్న బాణసంచా విక్రయ కేంద్రాలు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో దీపావళి వెలుగులు అంతగా కానరావడం లేదు. జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు బాణసంచా విక్రయాలకు అధికారులు అనుమతులు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 20 షాపులకు మాత్రం రెండు రోజులు మాత్రమే అమ్మకాలకు అనుమతులిచ్చారు. దీంతో నగరంలో బాణసంచా విక్రయాలు బుధవారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. దీపావళి పండుగ నెలాఖరున రావడంతో మధ్య తరగతి వారికి భారంగా మారింది.

తొలిరోజు అంతంతే...

ఓ వైపు బాణసంచా విక్రయాలకు మంగళవారం అర్ధరాత్రి వరకు అనుమతులు రాకపోవడంతో వ్యాపారులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు అనుమతులు రావడంతో బుధవారం ఉదయం 7గంటల నుంచే ఆర్ట్స్ కళాశాల మైదానంలో విక్రయాలు ప్రారంభించారు. తొలిరోజు విక్రయాలు అనుకున్న స్థాయిలో జరగకపోవడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. గత ఏడాది రూ.33 వేలు ఉన్న లైసెన్స్ ఫీజు ఈ ఏడాది రూ.38,500కు చేరింది. వ్యాపారాలు అనుకున్న స్థాయిలో జరగకపోవడంతో నష్టపోతామని వ్యాపారులు వాపోతున్నారు. లైసెన్స్ ఫీజులు పెరుగుతుండటంతో ధరలు కూడా రెండు, మూడు రెట్లు అధికమయ్యాయి. కొనుగోలుదారులు అనుకున్న స్థాయిలో ముందుకు రాకపోవడంతో తొలిరోజు విక్రయాలు సాదాసీదాగానే జరిగాయని చెప్పుకోవచ్చు.

ప్రమిదలకు భలే గిరాకీ

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళి అంటేనే దేదీప్యమైన వెలుగులు నింపే పండగ. ప్రతి ఇంటా వేడుకగా జరుపుకునే పండుగలో ప్రమిదల్లో దీపాలు వెలిగించి వరుసలతో ఏర్పాటు చేస్తారు. పూర్వం మట్టింట ప్రమిదలేనే వినియోగించేవారు.. రాను రాను ప్రమిదల్లో సరికొత్త హంగులతో ఆకర్షణీయంగా తయారు చేసి విక్రయిస్తున్నారు. దీంతో వీటి భలే గిరాకీ ఏర్పడుతుంది. లక్ష్మీగణపతి, లక్ష్మీకలశం, శంకు చక్రాలు, గజ వాహనం, కొబ్బరికాయ రూపం వంటి ఆకరాల్లో ఈ ప్రమిదలను తయారు చేసి విక్రయిస్తున్నారు.





ప్రమిదలు కొనుగోలు చేస్తున్న నగరవాసులు

పేరుకే 'మడ్డువలస' ఆయకట్టు

● రైతులకు తప్పని సాగునీటి కష్టాలు



ఆనకట్టకు అడ్డంగా ఇసుకబస్తాలు వేస్తున్న రైతులు

జి.సిగడాం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కూడా వరి పంట చివరి దశలో రైతులకు సాగునీటి కష్టాలు తప్పడంలేదు. సాగునీటి కోసం రైతులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం. చేతికి అంది వచ్చిన పంట నీరు లేక ఎండిపోతుండడంతో రైతులు నిట్టూరుస్తున్నారు. పక్కనే మడ్డువలస జలాశయం ఉన్నా ఆయకట్టు రైతులకు సాగునీరు గగణమైంది. దవళపేట, విజరాంపురం, సంతవురిటి, అనందపురం, లబోతులపేట, గ్రామాలకు మడ్డువలస జలాశయం ద్వారా సాగునీరు అందక ఆయకట్టు రైతులు అవస్థలు పడుతున్నారు. చెరువుల్లో నీరు లేకపోవడంతో వరి పంట ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు. రెల్లిగెడ్డ, పెద్దగెడ్డల వద్ద ఉన్న ఆనకట్టల ద్వారా జగన్నాథ సాగరం, అసిరమ్మ చెరువు, దొరచెరువు, కంచమ్మల చెరువు, కొత్త చెరువు, కాముని చెరవులకు సాగునీరు రావాల్సి ఉన్నా ఆయా ఆనకట్టల వద్ద శాశ్వత నిర్మాణాలు లేకపోవడంతో సాగునీరు వృథాగా పోతుందని దవళపేట మాజీ సర్పంచ్ కంచరాన సూరన్నాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం పెద్దగెడ్డ వద్ద సుమారు 60 మంది రైతులతో కలిసి వృథాగా పోతున్న నీటిని మళ్లించేందుకు ఇసుక బాస్తాలను అడ్డగా వేశామని ఆయన తెలిపారు. ఆ నీటిని చెరువులకు మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నట్టు స్పష్టం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సాగునీటి కోసం రైతులు పడుతున్న కష్టాలు తీర్చాలని, ఆనకట్టల వద్ద శాశ్వత పనులు చేపట్టాలని కోరారు. ఆయా గ్రామాల రైతులు కంచరాన సూరన్నాయుడు, ఎం.శ్యామలరావు, పి.చిరంజీవి, పి.రాజారావు, సీహెచ్ అసిరినాయుడు, ఆబోతుల గొల్ల, పి.శేఖర్, ఎం.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే బగ్గు

జలుమూరు (సారవకోట), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కిన్నెరవాడలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం లేగదూడలు ప్రదర్శన నిర్వహించారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ వైపు దృష్టి సారించాలన్నారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, పశుసంవర్థకశాఖ సంయుక్త సంచాలకులు మురళీధర్, డీడీ వి.జయరాజ్, ఏడీ మంద లోకనాథం, పశువైద్యాధికారి చల్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఎమ్మెల్యేను కలిసిన కాళింగ ప్రతినిధులు

ఆమదాలవలస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను బుధవారం కాళింగ సంక్షమ సేవా సంఘ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల విజయనగరం జిల్లా నూతనంగా ఎన్నికైన సంఘ అధ్యక్షుడు పేడాడ జనార్దనరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే స్వగృహం వద్ద కలిశారు. నూతనంగా నిర్మించిన సంఘ భవనానికి సంబంధించి ఎమ్మెల్యేతో చర్చించినట్టు తెలిపారు. సంఘ ప్రతినిధులు కంచరాన మురళీధర్, సీపాన వెంకటరావు, బలరాం ప్రసాద్ ఉన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన కాళింగ సామాజిక ప్రతినిధులు

తైక్వాండో పోటీలకు ముగ్గురు ఎంపిక



ఎంపిక పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవంబరు 12 నుంచి 15వ తేదీ వరకు గురునానక్ దేవ్ యూనివర్సిటీ (అమృతసర్)లో ఆల్ ఇండియా అంతర యూనివర్సిటీ తైక్వాండో పోటీలు జరగనున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున పాల్గొనే క్రీడాకారులను బుధవారం ఎంపికచేశారు. ఈ ఎంపిక ప్రక్రియలో వర్సిటీ, అనుబంధ కళాశాలల నుంచి 24 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఎల్.జగదీశ్వరి, ఎ.భువనేశ్వరి, యు.అను ఎంపికయ్యారు. ఈ ఎంపిక ప్రక్రియకు న్యాయనిర్ణేతలుగా తైక్వాండో రిఫరీలు మజ్జి గౌతమ్, ఎం.సాయిబాలాజీ వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని స్పోర్ట్స్ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ పి.రవికుమార్, క్రీడా విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.భాస్కర్ పర్యవేక్షించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ఆమదాలవలస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు, భద్రతపై అగ్నిమాపక అధికారి బొడ్డేపల్లి హరినారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం పట్టణంలోని చిన్న కృష్ణాపురంలోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటరత్నాలమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఆర్పీకే మద్యం విక్రయించాలి

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీ ఆధారంగా ఎంఆర్పీకే మద్యం విక్రయించాలని, అంతకుమించి విక్రయిస్తే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. షాపుల వద్ద ధరల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, దీనిపై అధికారులు నిరంతర నిఘా పెట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బెల్ట్ దుకాణాలు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా చేసే షాపులపై కూడా నిఘా ఉంచాలని, లైసెన్స్‌దారులు పరిమితికి మించి మద్యం విక్రయించకూడదన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాఅలని ఆయన కోరారు.

రిలే రేస్ పోటీల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రతిభ

ఎచ్చెర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25, 26 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ రిలే రేస్ పోటీల్లో పాల్గొన్న ట్రిపుల్ ఐటీ, శ్రీకాకుళం క్యాంపస్‌లో పీయూసీ చదువుతున్న విద్యార్థి ఆర్.శివసాయి ప్రతిభ కనబరిచారు. ఈ విద్యార్థి ప్రతిభను క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అభినందించారు. కార్యక్రమంలో ఏవో మునిరామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎఫ్‌వో వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి

ఎచ్చెర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని బుధవారం జరిగింది. కార్యక్రమంలో వీసీ కేఆర్ రజని, వర్సిటీ ఎస్‌వో కె.స్వామ్రాజ్యలక్ష్మి, వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.వనజ తదితరులు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్యత అవసరం

ఆమదాలవలస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నిరుద్యోగ యువతీ ఉపాధి అవకాశాలు పొందడానికి నైపుణ్యత ఎంతో అవసరమని ఇన్‌చార్జి కమిషనర్ జాన్సన్ అన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ నోడల్ ఆఫీసర్ బొడ్డేపల్లి చంద్రమౌళి పర్యవేక్షణలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్కిల్ సెన్సెస్‌లో భాగంగా వార్డు సచివాలయం ఉద్యోగులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ జాన్సన్ మేనేజర్ బి.సాయి, శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ ఏవీ శ్రీనివాసరావు, బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, జి.భాస్కరరావు పాల్గొన్నారు.

శివాలయాలు ముస్తాబు

గార, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): కార్తీకమా సం కోసం మండలంలో ప్రసిద్ధ శైవ క్షేత్రాలను సిద్ధం చేస్తున్నారు. శ్వేతగిరి (శాలిహుండం కొండ)పై వెలసిన వీరవదంతీశ్వరస్వామి ఆలయంలో కార్తీకంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. ఇక్కడే ఈ ఆలయం వద్దనే అభయాంజనేయ స్వామి, అయ్యప్ప స్వామి వారి క్షేత్రాలు కూడా ఉన్నాయి.

బాధ్యతగా పనిచేయాలి

లావేరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో వెంకటరాజు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. మండలానికి కేటాయించిన ఇంకుడు గుంతలు, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్, ఎవెన్యూ ప్లాంటేషన్, ఫారంపాండ్లు తదితర పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఆర్.సత్యవతి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తుల గడువు పెంపు

సరుబుజ్జిలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెన్నెలవలస వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవడానికి నవంబరు 9వ తేదీ వరకు గడువు పెంచినట్టు ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే శంకర్



శ్రీనివాస్ అంతిమయాత్రలో పాడె మోస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధి 29వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కోలా శ్రీనివాస్ దేవ్ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్ మృతదేహంపై పార్టీ జెండా కప్పి, అంతమయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని పాడె మోశారు. వివిధ డివిజన్ల టీడీపీ ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బూర్జ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ప్రవల్లిక అన్నారు. లచ్చయ్యపేట గ్రామంలో బుధవారం ఆమె పర్యటించారు. అనవసరంగా తగాదాలకు దిగవద్దని సూచించారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలన్నారు. దీపావళి పండగను జాగ్రత్తగా జరుపుకోవాలన్నారు.

అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

నరసన్నపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ అందరి జీవితాల్లో చీకట్లు తొలగించి వెలుగులు నింపుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దీపావళి అందరిలోనూ సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా ఆయనను బుధవారం ల్యాండ్ అక్విజేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లావణ్య కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య


దివ్య (ఫైల్)

టెక్కలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో నివాసముంటున్న సంపతిరావు దివ్య(28) అనే వివాహిత బుధవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మృతురాలు గత కొన్నాళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతూ మన స్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త శ్రావణ్ కుమార్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ కె.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక డంప్ చేస్తున్న ఎక్స్‌కవేటర్ సీజ్

హిరమండలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భగీరథపురం వాలయం సమీపంలో వంశధార నదీ గర్భంలో ఇసుకను అక్రమంగా తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భగీరథపురం సమీపంలో వంశధధార నదిలో మంగళశారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో లారీలోకి ఇసుకన ఎక్స్‌కవేటర్‌తో డంపింగ్ చేస్తుండగా ఆర్ఐ ఉమాశంకర్ పట్టుకొని అప్పగించారు. ఇసుకను అక్రమంగా లోడ్ చేస్తున్న ధనుపురానికి చెందిన ఎక్స్‌కవేటర్ యజమాని నెయ్యిల రామారావు, పలాసకు చెందిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కష్టాలనే చీకట్లు తొలగి వెలుగులు నిండాలి: మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళిఅక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ దీపావళి పండగ సందర్భంగా కష్టాలనే చీకట్లు తొలగి వెలుగులు నిండాలని రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దీపావళి రోజున టపాసులు కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ పండగ అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని, ఆనందం వెల్లివిరియాలన్నారు. పర్యావరణ హితంగా దీపావళిని జరుపు కోవాలన్నారు. పండగ వేళ ప్రతి ఇంటిలో ఆనందం కాంతులు నింపాలన్న ధ్యేయంతో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామం నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

డిసెంబరులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

పాతపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణా లను పూర్తి చేయకుంటే బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదురవుతాయని మండల ప్రత్యేకాధికారి డా.మంచు కరుణాకరరావు ఎంపీ డీవో చంద్రకుమారి అన్నారు. సీతా రాంపల్లి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ.. రూఫ్ లెవెల్‌లో ఉన్న వారంతా నిర్ణీత గడువులోగా, అంతకంటే తక్కువ దశలో ఉన్న ఇళ్లను మార్చి 31లోగా పూర్తి చేయాల్సి ఉంటుం దన్నారు. కార్యక్ర మంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మోహన్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు

పలాస, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. బుధవారం స్థానిక నెమలినారాయణపురం గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛత పాటించాలని, ఇళ్లలో ఉత్పత్తి అవుతున్న చెత్తను కాలువల్లో వేయవద్దని సూచించారు. రోడ్లపై పశువులు విడిచి పెట్టకుండా ఇంటివద్ద కట్టాలని, లేకుంటే చర్యలు తప్పవని పశువుల కాపర్లు, యజమానులకు హెచ్చరించారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

మాజీ మంత్రి అప్పలరాజుకు అస్వస్థత

● శ్రీకాకుళం మెడికవర్‌లో చికిత్స


చికిత్స పొందుతున్న అప్పలరాజు

పలాస, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఉదయం ఇంటి వద్ద జిమ్ చేస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం తరలించారు, స్వతహాగా గుండె సంబంధిత వైద్యాధికారి కావడంతో ప్రాథమిక చికిత్స ఆయనే స్వయంగా చేసుకున్నారు. సీటీ స్కాన్ నిర్వహించి ఎటువంటి ఇబ్బందులు లేవని డా.అన్నాజీరావు తెలిపారు. ఇదిలా ఉండగా అప్పలరాజు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న పలాస నియోజకవర్గ వైసీపీ నాయకులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుసు కొని ఊపిరి పీల్చుకున్నారు. అప్పలరాజు వెంట ఆయన సతీమణి సీదిరి శ్రీదేవి ఉన్నారు.

పోలీసులు ప్రజల్లో భాగం: సీఐ

పలాస, అక్టోబరు 30: పోలీసులు ప్రజల్లో భాగమని, వారు ఎటువంటి కష్టాల్లో ఉన్నా ఆదుకునేందుకు తాము ముందుంటామని సీఐ డి.మోహనరావు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉచిత వైద్య, రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వురు విద్యార్థులు, పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. జెమ్స్ కళాశాల వైద్య బృం దం వైద్య సేవలందించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ పటేల్ జయంతి

టెక్కలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సర్దార్ వల్లభభాయి పటేల్ జయంతిని నిర్వహించారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులతో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లూక్‌పాల్, అధ్యాపకులు త్రినాథరావు, వాసుబాబు, గొల్ల, కోటేశ్వర రావు, జగన్నాథ్, ధర్మారావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నీలవేణమ్మ సేవలు మరువలేనివి



వజ్రపుకొత్తూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్యాలయ సబ్ స్టాఫ్‌గా నీలవేణ మ్మ సేవలు మరువలేని వని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యులు ఎ.తేజేశ్వరి, రిచార్డ్‌బూస్ అన్నారు. బుధవారం పీహెచ్‌సీలో నీల వేణమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి అభి నందించారు. కార్యక్రమంలో అక్కుపల్లి పీహెచ్‌సీ వైద్యులు రెడ్డి, సిబ్బంది చక్రధర్ గోపాల్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన బొడ్డపాడు జెస్సీ కబడ్డీ టీమ్



పలాసరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన జెస్సీ కబడ్డీ జట్టు ఇటీవల సంతబొమ్మాళిలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచింది. ఈ నేపథ్యంలో క్రీడాకారులను బుధవారం గ్రామస్థులు అభినందించారు. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా లండ సంతోష్, బెస్ట్ డిఫెం డర్‌గా రాపాక నవీన్ ప్రతిభ చూపడంతో విజయం సాధ్యమైందని నిర్వాహకుడు కిక్కర డిల్లీరావు తెలిపారు. జిల్లా స్థాయిలో జెస్సీ కబడ్డీ టీమ్ ప్రతిభ చాటడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదమరిస్తే ప్రమాదమే!

నందిగాం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెంటూరు- శివరాంపురం మార్గంలో ఏర్పడిన గొయ్యితో ప్రమాదం పొంచివుంది. ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం బారిన పడే అవకాశాలున్నాయి. ఈ గొయ్యికి హెచ్చరి సూచికగా రాటను ఏర్పాటు చేశారు. అయితే ఈ రాట కూడా రాత్రి సమయాల్లో కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి గాయాలబారిన పడాల్సి వస్తోందని పలువురు వాహనచోదకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని వారు కోరుతున్నారు.


పెంటూరు–శివరాంపురం రోడ్డులో ఏర్పడిన రంధ్రం, రాట

సీఎం చంద్రబాబు పర్యటనకు పటిష్ఠ చర్యలు తీసుకోండి

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు నవంబరు ఒకటిన ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు నిమ్మాడలోని తన కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో ఫోన్‌లో దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చే అవకాశముందని, వారికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు, ప్రొటోకాల్, సభా ప్రాంగణానికి ఎటు వంటి ఇబ్బందులు లేకుండా చేరుకు నేటట్లు సౌకర్యాలు, వాహన పార్కింగ్‌పై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డిలతో ఫోన్‌లో సీఎం పర్యటన అంశాలపై మాట్లాడినట్లు ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు

ఇచ్ఛాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈదుపురంలో శుక్రవారం జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు బుధవారం హెలీపాడ్ పనులను ఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు.

దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ పథకం ఇక్కడి నుంచే ప్రారంభించనున్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో సంభా షించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవోలు, సీఐలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి



హెలీప్యాడ్ ఏర్పాట్ల దృశ్యం, వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

సక్రమంగా పనిచేయకుంటే తప్పుకోండి

● డ్వామా పీడీ సుధాకరరావు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో సక్రమంగా పనిచేయకుంటే తప్పుకో వాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణంలో ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మస్టర్లలో ఎక్కువ దిద్దుబాట్లు గుర్తించామని, ఇలాంటి తప్పులు మరలా జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాది సోషల్ ఆడిట్ బృందానికి తప్పులు వెతికే అవకాశం ఇవ్వవద్దన్నారు. మండలంలో ఉపాధి హామీ పంచాయతీరాజ్, నీటి పారుదల, సర్వశిక్షా అభియాన్‌కు సంబంధించి 1298 పనులు చేపట్టినట్లు వివరించారు. బాతుపురం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ కొయిరి జయలక్ష్మి 2016 నుంచి 2022 వరకు వేతనాలివ్వలేదని పీడీ ఎదుట కన్నీరు మున్నీరయ్యారు. ఈ అంశాన్ని పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారు. డీవీవో ఆర్.స్వరూపా రాణి, ఏపీడీలు పి.రాధ, ఎం.శైలజ, ఏపీఎం పిట్ట కేశవరావు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో పల్లెలకు మహర్దశ

పలాసరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో పల్లెలకు మహర్దశ పట్టనుందని డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో రూ.14 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. పల్లెల్లో రోడ్లు, కాలువలు వంటి సదుపాయాలు కల్పించడం వల్ల పరిశుభ్రమైన వాతావరణ ఏర్పడుతుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఏపీవో జె.శంకరరావు, ఈసీ అమ్మనాయుడు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు పూలమొక్క ఇస్తున్న డ్వామా పీడీ

ఎమ్మెల్యే దృష్టికి ఉపాధి పనుల వివరాలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో చేపట్టనున్న ఉపాధి పనుల వివరాలను ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు డ్వామా పీడీ బి.సుధాకర రావు వివరించారు. ఈ మేరకు బుధవారం రామయ్య పుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు: కలమట

మెళియాపుట్టి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నూతన పాలసీ ద్వారా పేదలకు తక్కువ ధరకు మద్యం అందించేందుకు దుకాణాలను అందించిందన్నారు, మద్యం షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. అధిక ధరలకు మద్యం అమ్మితే చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారన్నారు.

అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలి

మందస,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యువత అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలని స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ సోమేశ్వరరావు, మాస్టర్ ట్రైనీస్ యువరాజు, శ్రావణ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం సచివాలయాల సిబ్బంది, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రానున్న రోజుల్లో ఆటోమెటేషన్, కృత్రిమ మేధా ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ప్రభుత్వ నైపుణ్య గణన చేపట్టి దాని ఆధారంగా యువతకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. నవంబరు నుంచి గ్రామాల్లో గణన ప్రారంభిస్తారని, యువత నైపుణ్యంపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో ఏవో రుషేశ్వరరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జయప్రకాశ్ పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్‌లు నిర్వహించండి

ఇచ్ఛాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో వ్యాధులు ప్రబలుతున్నాయని వెంటనే మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని 8వ వార్డు కౌన్సిలర్ పల్లంటి మధుమూర్తి కోరారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఎజెండాలో పొందిపరిచిన ఆరు అంశాలపై చర్చించి ఆమోదించారు. అనంతరం జీరో అవర్‌లో పలు సమస్యలపై అధికారులను కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించారు. వైస్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

డొంకూరు విద్యార్థుల ప్రతిభ

ఇచ్ఛాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సౌత్ జోన్ ఖోఖో పోటీల్లో డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జె.సరోజిని విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో జరిగిన ఖోఖో పోటీల్లో జిల్లా జట్టు తరుఫున వై.భవాని, డి.మీనా, పి.గీత, బి.ధనలక్ష్మి పాల్గొని సత్తా చాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజాదర్బార్: ఎమ్మెల్యే ఎంజీఆర్

కొత్తూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావేదిక నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు, నేతలు తరలివచ్చి సమస్యలపై 282 వినతి పత్రాలు అందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మార్గంలో మురుగునీరు పారుతోందని, తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ కోరారు. కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో రైతులు భూ సర్వేలో తప్పులు సరిచేయాలని, పారాపురంలో దళితుల శ్మశాన వాటిక కు, గిరిజన గ్రామాలకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవర ప్రసాద రావు, ఎంపీటీసీ బైరాగినాయుడు, తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీవో నీరజ, పాల్గొన్నారు.


ప్రజాదర్బార్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎమ్మెల్యేకు సత్కారం

కొత్తూరు మండల ఉపాధి హామీ సిబ్బంది ఎమ్మెల్యే మామిడి గోవిందరావును సత్కరించారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. పరిష్కారానికి కృషి చేస్తా నని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్య క్రమంలో ఉపాధి హామీ ఏపీవో ప్రేమ లత, ఈసీ శ్రావణి, పలువురు సాంకేతిక, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు సమయ పాలన పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా వృత్తివిద్యా శాఖాధికారి(డీవీఈవో) ఎస్.తవిటినాయుడు అన్నారు. లక్ష్మీనర్సు పేట ప్రభుత్వ జూనియర్ కళాశా లను బుధ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకుల హాజరు పట్టికలు, రికార్డులను పరిశీలించారు. అధ్యాపకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కళాశాల సమయపాలన పాటించాలన్నారు. సకాలంలో సిలబస్‌లు పూర్తిచేసి ఉత్తమ విద్యార్థులుగా తీర్చి దిద్దాలని సూచించారు. ఏజీఎంవో తాతారావు పాల్గొన్నారు.


ఎల్ఎన్‌పేట: రికార్డులను పరిశీలిస్తున్న డీవీఈవో తవిటినాయుడు

తొమ్మిది ప్రిన్సిపాళ్ల పోస్టులు ఖాళీ

హిరమండలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొమ్మిది జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని డీవీఈవో ఎస్.తవిటినాయుడు తెలిపారు. బుధవారం హిరమండ లం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టుల స్థానంలో అదే కళాశాలలో పనిచేస్తున్న సీనియర్ అధ్యాపకులకు బాధ్యతలు అప్పగించామన్నారు. గోవిందపురం, నందిగాం, నివగాం కళాశాల లకు సొంత భవనాలు లేవన్నారు. ఈ ఏడాది 12,375 మంది ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. బోధనకు అధ్యాపకుల కొరత లేదన్నారు.

ఆకట్టుకున్న బాల గణితావధానం

కంచిలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నువాగడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం దుర్గాప్రసాద్ పాడి అధ్యక్షతన జరిగిన గణితావధానం, మేధా సంపత్తి కార్యక్రమం ఆకట్టుకుంది. సమన్వయకర్త గణితావధాని మద్దు తిరుపతిరావు శిష్యురాలు చోట్రాయిపురం ఎంపీపీ స్కూల్‌కి చెందిన ఉలాల నందు (థర్డ్‌క్లాస్) ఘన మూలం, వారగణన 2024, మనోసంకలనం, 3-3 గణిత చదరం, వరుస 100 సంఖ్యల మొత్తం అంకెలతో ఆటలు, మనోగుణకారం, దత్తాంకం తది తర అంశాలపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తంకదర్ డొలై, చంద్రమణి గోమాంగో, గోపి, చైతన్య, డి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాలవేధావి ఉలాల నందు

వేడుకగా ముందస్తు దీపావళి

ఇచ్ఛాపురం/సోంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ముందస్తు దీపావళిని ఘనంగా నిర్వహించారు. ముగ్గులు వేసి చిన్నారులు మతాబులు కాల్చి సందడి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నరసమ్మ, ఆయాలు పాల్గొన్నారు. అలాగే బలరాపురం ఎంపీయూపీ పాఠశాలలో హెచ్‌ఎం ప్రభాకరరావు, ఉపాధ్యాయులు ధర్మరాజు, యశోద, నీలవేణి, శేఖర్, సత్యవతి, గౌరి ఆధ్వర్యంలో ముందస్తు దీపావళిని చేశారు. సోంపేటలోని రవీంద్రభారతి పాఠశాలలో దీపావళి సంబరాలు నిర్వహించారు.


ఇచ్ఛాపురం: సందడి చేస్తున్న చిన్నారులు


సోంపేట: దీపాల వెలుగుల్లో..

ఇంటర్వ్యూ

పనుల వివరాలు యాప్‌లో నమోదు

● ఎల్.వెంకటరావు, ఈవోపీఆర్డీ



పాతపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న పలు కార్యక్రమాలను ప్రభుత్వం కొత్తగా రూపొందించిన పీఆర్-1 యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని ఈవోపీఆర్డీ ఎల్.వెంకటరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రశ్న: ఈయాప్ ద్వారా ఏయే పనులను పర్యవేక్షిస్తారు?

జవాబు: గ్రామాల్లోని కాలువలు, చెత్త కుప్పలు, వాటర్ ట్యాంక్‌లు, పొదలు, ఎస్ డబ్ల్యూపీసీలు. వంటివి ప్రతిరోజూ చేపట్టిన పనులను పొందుపరచాలి.

ప్ర: చెత్త నుంచి సంపద కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదన్న విమర్శలు వస్తున్నాయి?

జ: పలు గ్రామాల్లో వర్మీ కంపోస్టు తయారీకి సిద్ధంగా ఉన్నాం. దానికి మార్కెటింగ్ కోసం ప్రణాళికలు రూపొందించాం. అతిత్వరలోనే రూపుదాల్చుకుంటాయి.

ప్ర: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారా?

జ: ప్రతీ గ్రామంలో ఫాగింగ్ చేయించాలని కార్యదర్శులకు సూచనలిచ్చాం.

ప్ర: తాగునీటి కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నారా?

జ: 42 రక్షిత నీటిపథకాల ట్యాంకులను 15రోజులకోసారి వాటర్‌ట్యాంక్‌లు పరిశుభ్రపరచడం జరుగుతోంది.

న్యూస్ బాక్స్

విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి

పలాస, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్చాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక కళాశాల ఆవరణలో తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులున్నారని, వారి బోధనలతో విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థుల చదువుపై ఇంటి వద్ద పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.వెంకటమోహన్, పి.చిరంజీవులు, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లు అందజేత

మెళియాపుట్టి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ నిర్వాసిత గ్రామం దాసుపురం కాలనీ, టెక్కలి పట్నంలలో ఎల్ఈడీ లైట్లను పాతపట్నం జనసేన నాయకురాలు కోరికాన భవాని సొంత నిధులతో బుధవారం అందజేశారు. గత ఐదేళ్లుగా వీధి దీపాలు, కాలువలు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఎల్ఈడీ లైట్లతో ఇళ్లలో దీపావళికి వెలుగులు నిండేలా కృషి చేశామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బాలరాజు, కిరణ్, టి.ప్రసాదరావు, సర్పంచ్ ఈశ్వరరావు, పలువురు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలి

సంతబొమ్మాళి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలని, దీనికి బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డీజీఎం బసవలింగం అన్నారు. బుధవారం బోరుభద్రలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తమ బ్యాంక్ ద్వారా సీనియర్ సిటిజన్, పదేళ్ల లోపు పిల్లలకు ప్రత్యేక డిపాజిట్ పథకం ఉందన్నారు. దీపావళి సందర్భంగా ధనవర్ష పథకాన్ని ప్రవేశ పెట్టామని, దీనిపై 333 రోజులకు 7.5 శాతం వడ్డీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి బ్రాంచి చీఫ్ మేనేజర్ ఉషా శాంతి, సూపర్‌వైజర్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే పాలసీలు తీసుకోవాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ యాజమాన్యం ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆ సంఘ ఏజెంట్లు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. పాలసీ లపై బోనస్ పెంచాలని, జీఎస్టీ రద్దు చేయాలి, కమీషన్ పెంచాలి, పాత పద్ధతిలోనే పాలసీలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.శ్రీనివాసరాజు, పి.ఢిల్లేశ్వరరావు, ఎం.ధర్మరాజు, కె.దివాకర్‌రెడ్డి, దుర్యోధనరెడ్డి, వెంకటరావు, గిరిబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.